## షిర్కె అస్గర్ : (చిన్నతరహా షిర్క్)

ఇది మనిషిని ముస్లిం సముదాయం నుండైతే వేరుపరచదు గాని దానివల్ల 'ఏకదైవారాధన' (తౌహీద్)లో దోషం ఏర్పడుతుంది. అంతేకాదు, అది అతన్ని క్రమక్రమంగా 'షిర్కె అక్బర్' వైపు తీసుకెళుతుంది. షిర్కె అస్గర్ కూడా రెండు రకాలు : (1) కనిపించే షిర్క్ (2) కనిపించని షిర్క్.

## (1) కనిపించే షిర్క్:

అంటే మనిషి మాటల ద్వారా, చేతల ద్వారా వ్యక్తమయ్యే షిర్క్ అన్నమాట. ఉదాహరణకు : దైవేతరులపై ఒట్టేసి చెప్పటం. దీని గురించి మహాప్రవక్త (ﷺ) ఇలా ప్రవచించారు :

"مَنْ حَلَفَ بِغَيْرِ اللّٰهِ فَقَدْ كَفَرَ أَوْ أَشْرَكَ" (ترمذی:۱۵۳۵صحیح۔ابوداود:۳۲۵۱صحیح)

**"ఎవరయితే దైవేతరునిపై ప్రమాణం చేశాడో అతను తిరస్కారాని (కుఫ్ర్) కి పాల్పడ్డాడు" లేదా ఆయనిలా అన్నారు : "అతను షిర్క్‌కి ఒడిగట్టాడు." (ఈ హదీసును తిర్మిజీ – 1535 సహీగా పేర్కొన్నారు. హాకిమ్ దీనిని సహీహ్‌గా పేర్కొన్నారు).**

مَاشَاءَ اللّٰهُ وَ شِئْتَ "అల్లాహ్ కోరినట్లుగా మరియు తమరు కోరుకున్నట్లుగా" అని చెప్పటం కూడా ఈ కోవకు చెందినదే. ఒకసారి ఒక సహచరుడు ఇలాగే అంటే, దైవప్రవక్త (ﷺ) అతనిని ఈ విధంగా మందలించారు :

"أَجَعَلْتَنِي لِلّٰهِ نِدًّا؟ قُلْ: مَا شَاءَ اللّٰهُ وَحْدَهُ" (نسائی:۳۷۷۳صحیحہ:۱۳۹) "ఏమిటి, నీవు నన్ను అల్లాహ్‌కు పోటీగా పరిగణిస్తున్నావా? (ఇది తప్పు. దీనికి బదులు) నీవు ఈ

https://teluguislam.net

విధంగా అను : ఒక్కడైన అల్లాహ్ కోరినట్లుగా." (అస్సహీహ – 139) అలాగే "لولا الله ثم و فلان" "ఒకవేళ అల్లాహ్ లేకుంటే, ఫలానా వ్యక్తి లేకుంటే" అని చెప్పటం కూడా ఇలాంటిదే.

**ماشاء الله ثم شاء فلان** "అల్లాహ్ తలచినట్లుగానే జరిగింది. దానిమీదట ఫలానా వ్యక్తి అభిలషించినట్లుగా జరిగింది" అని అంటే అది సరైనదే. 'దానిమీదట' లేదా 'ఆపైన' అనే పదం చేరిస్తే అది ఒప్పే. ఎందుకంటే ఈ విధంగా అన్నప్పుడు దాసుని కోరిక దేవుని కోరికకు లోబడినట్లవుతుంది. ఉదాహరణకు : అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَا تَشَاؤُونَ إِلَّا أَن يَشَاءَ اللَّهُ رَبُّ الْعَالَمِينَ﴾ (التكوير:٢٩)

**"సర్వలోక ప్రభువు అయిన అల్లాహ్ కోరనంత వరకు మీరేదీ కోరలేరు." (అత్ తక్వీర్ : 29)**

"مالي إلا الله وأنت" **"నా కొరకు అల్లాహ్ మరియు మీరు తప్ప ఎవరూ లేరు"** అని చెప్పటం కూడా ఒక విధంగా షిర్క్‌తో కూడిన పలుకే. "وهذا من بركات الله وبركاتك" "ఇది అల్లాహ్ శుభాల వల్ల మరియు మీ శుభాల వల్లనే ప్రాప్తించింది" అని అనటం కూడా ఇలాంటిదే.

## షిర్క్‌తో కూడిన పనుల ఉదాహరణ :

ఏదైనా ఆపద నుండి బయటపడేందుకు లేదా ఏదైనా గండాన్ని తొలగించేందుకు కడియం ధరించటం, దారం కట్టడం, దిష్టి తగులుతుందనే భయంతో తాయెత్తు కట్టడం, వెంట్రుకల హారాలు తొడగటం మొదలగునవి.

ఇలాంటివన్నీ గండాల నుండి గట్టెక్కటంలో, కష్టాలను దూరం చేయటంలో తోడ్పడతాయని గనక మనిషి నమ్మితే ఇది షిర్కె అస్గర్ (చిన్న తరహా షిర్క్) క్రిందికి వస్తుంది. ఎందుకంటే అల్లాహ్ ఈ వస్తువులను ఇలాంటి ఉద్దేశాల ప్రాప్తి కొరకు సాధనంగా చేయలేదు. ఒకవేళ ఈ వస్తువులు తమంతట తాముగా ఆపదలను దూరం చేస్తాయని నమ్మితే మాత్రం అది 'షిర్కె అక్బర్' గానే పరిగణించబడుతుంది. ఎందుకంటే ఇది దైవేతరులపై ఆశ పెట్టుకోవటం వంటిదే.

## (2) కనిపించని షిర్క్:

అంటే దాగి ఉన్న షిర్క్ అన్నమాట. ఇది మనిషి సంకల్పంలో మనోభావంలో ఉంటుంది. ఉదాహరణకు : ప్రదర్శనాబుద్ధి. అంటే ఒక వ్యక్తి దైవప్రసన్నతను చూరగొనే ఉద్దేశంతో ఒక సత్కార్యం చేసే బదులు జనుల మెప్పును కాంక్షించి చేస్తాడు. ఉదాహరణకు: ఎంతో ఏకాగ్రతతో నమాజ్ చేస్తాడు లేదా దానధర్మాలు చేస్తాడు. కాని అతని మనసులో లోకులు తనను ప్రశంసించాలన్న కోరిక ఉంటుంది.

https://teluguislam.net

ఏదైనా ఒక కార్యంలో ప్రదర్శనా మనస్తత్వం వచ్చిందంటే, అది అతని పనిని పాడు చేసేస్తుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿فَمَن كَانَ يَرْجُو لِقَاءَ رَبِّهِ فَلْيَعْمَلْ عَمَلًا صَالِحًا وَلَا يُشْرِكْ بِعِبَادَةِ رَبِّهِ أَحَدًا﴾ (الكهف:١١٠)

**“కనుక తన ప్రభువును కలుసుకోవాలన్న ఆకాంక్ష ఉన్నవాడు సత్కార్యాలు చేయాలి. తన ప్రభువు ఆరాధనలో వేరొకరికి భాగ స్వామ్యం కల్పించకూడదు.” (అల్ కహఫ్ : 110)**

షిర్కె అస్గర్ (చిన్న తరహా షిర్క్) గురించి ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ఉపదేశించారు :

”أَخْوَفُ مَا أَخَافُ عَلَيْكُمُ الشِّرْكُ الأَصْغَرُ، قَالُوا يَا رَسُولَ اللهِ وَمَا الشِّرْكُ الأَصْغَرُ، قَالَ: الرِّيَاءُ“ (احمد:٢٢٥٢٨، طبرانی، بغوی، بیہقی)

**“మీ విషయంలో నాకు అన్నిటికన్నా అధికంగా ‘షిర్కె అస్గర్’ గురించిన భయముంది. ‘దైవప్రవక్తా! షిర్కె అస్గర్ అంటే ఏమిటి?’ అని ప్రియ సహచరులు విన్నవించుకోగా, “ప్రదర్శనా బుద్ధి” అని ఆయన (ﷺ) చెప్పారు. (అహ్మద్–22528, తిబ్రానీ)**

అలాగే ఎవరయినా ప్రాపంచిక స్వలాభాలను ఆశించి ఏదైనా సత్కార్యం చేస్తే, అది కూడా ‘కనిపించని షిర్క్’లోకి వస్తుంది. ఉదాహరణకు : ఎవరయినా కేవలం సిరిసంపదల కోసం హజ్జ్ చేయటం, లేదా అజాన్ ఇవ్వటం, లేదా సామూహిక నమాజ్‌కు సారథ్యం వహించటం, లేదా కేవలం సిరిసంపదలను ఆశించి ధర్మజ్ఞానాన్ని ఆర్జించటం, జిహాద్ చేయటం. మహనీయ ముహమ్మద్ (ﷺ) ఇలా ప్రవచించారు :

”تَعِسَ عَبْدُ الدِّينَارِ، وَ تَعِسَ عَبْدُ الدِّرْهَمِ، تَعِسَ عَبْدُ الْخَمِيصَةِ، تَعِسَ عَبْدُ الْخَمِيلَةِ إِنْ أُعْطِيَ رَضِيَ وَ إِنْ لَمْ يُعْطَ سَخِطَ“ (بخاری)

**“దీనార్‌కు దాసోహం అన్నవాడు నాశనమయ్యాడు. దిర్హమ్‌కు దాసోహం అన్నవాడు నాశనమయ్యాడు. చారలు గల దుప్పటిని కలిగి ఉన్న దాసుడు నాశనమయ్యాడు. పనితనము (చిత్రీకరణ) గల దుప్పటి ఉన్న దాసుడు నాశనమయ్యాడు. అతనికేదైనా ఇవ్వబడితే సంతోషిస్తాడు. ఇవ్వకపోతే కినుక వహిస్తాడు.” (బుఖారీ)**

ఈ విషయమై ఇమామ్ ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ఇలా అంటున్నారు: “సంకల్పాలలో, ఉద్దేశాలలో షిర్క్ అనేది తీరంలేని సముద్రం వంటిది. అతి కొద్ది మంది మాత్రమే దాని నుండి బయటపడగలుగుతారు. కనుక ఎవరయినా తన ఆచరణ ద్వారా దైవప్రసన్నతతో పాటు వేరొక సంకల్పం చేసుకుంటే, అల్లాహ్ సామీప్యం పొందటంతో పాటు ఇతరత్రా ఉద్దేశ్యాలకు కూడా చోటిస్తే అతను తన సంకల్పంతో షిర్క్ చేసినట్లే.”

https://teluguislam.net

ఈ సందర్భంగా 'సంకల్ప శుద్ధి' అంటే భావం దాసుడు తన మాటలను, చేతలను, సంకల్పాన్ని కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకించాలి. (అంటే కేవలం అల్లాహ్ ప్రసన్నతను చూరగొనటమే అతని ధ్యేయమై ఉండాలి). ఇదే అసలుసిసలు ఏకోన్ముఖత. అంటే సిసలయిన ఇబ్రాహీమ్ విధానం. దీనిని అవలంబించమని దేవుడు తన దాసులందరికీ ఆజ్ఞాపించాడు. ఇది మినహా ఆయన ఎవరి నుండీ, ఎలాంటి దానినీ అంగీకరించడు. ఈ ఏకోన్ముఖతే ఇస్లాం వాస్తవికత. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَمَن يَبْتَغِ غَيْرَ الْإِسْلَامِ دِينًا فَلَن يُقْبَلَ مِنْهُ وَهُوَ فِي الْآخِرَةِ مِنَ الْخَاسِرِينَ﴾(آل عمران:٨٥)

**"ఎవరయినా ఇస్లాంను కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తే అతని ధర్మం స్వీకరించబడదు. అలాంటి వ్యక్తి పరలోకంలో నష్టపోయిన వారిలో చేర్తాడు." (ఆలి ఇమ్రాన్ : 85)**

"ఇదే సిసలయిన ఇబ్రాహీమ్ (عليه السلام) విధానం. దీని నుండి ముఖం త్రిప్పుకున్నవాడు, విసుగును ప్రదర్శించినవాడు అతి పెద్ద మూర్ఖుడు." (అల్ జవాబుల్ కాఫీ - పేజి : 115)

## షిర్కె అస్గర్ - షిర్కె అక్బర్‌కి మధ్యగల వ్యత్యాసాలు

వెనుకటి చర్చ ప్రకారం ఈ రెండు రకాల షిర్క్ మధ్య గల తేడాలు ఇవి :

1. షిర్కె అక్బర్ (పెద్ద తరహా షిర్క్) మనిషిని ముస్లిం సముదాయం నుండి బహిష్కరిస్తుంది. షిర్కె అస్గర్ (చిన్న తరహా షిర్క్) ముస్లిం సముదాయం నుండి మనిషిని బహిష్కరించదు గాని అతని ఏకదైవారాధనా విశ్వాసంలో లోపం ఏర్పరుస్తుంది.
2. షిర్కె అక్బర్‌కు పాల్పడినవాడు శాశ్వతంగా నరకయాతనను అనుభవిస్తాడు. షిర్కె అస్గర్‌కు ఒడిగట్టినవాడు నరకానికి ఆహుతి అయినా శాశ్వతంగా నరకంలోనే ఉండడు.
3. షిర్కె అక్బర్ మనిషి ఆచరణలన్నింటినీ నాశనం చేసేస్తుంది. కాగా, షిర్కె అస్గర్ ఆచరణలన్నింటినీ వృధా చేయదు. ఏ ఆచరణలో అది (ప్రదర్శనాబుద్ధి, ప్రాపంచిక స్వలాభాపేక్ష) జొరబడుతుందో దానిని మాత్రమే నాశనం చేస్తుంది.
4. షిర్కె అక్బర్ ముష్రిక్కుల ధన ప్రాణాలను ధర్మసమ్మతం చేసేస్తుంది. కాని షిర్కె అస్గర్ వల్ల అతని ధన ప్రాణాలు ధర్మసమ్మతం అవవు.

https://teluguislam.net